# సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో అపరిశుభ్రత

- భక్తుల రద్దీకి అనుగుణంగా లేని సౌకర్యాలు..
- పవిత్ర పుణ్యక్షేత్రంలో పారిశుద్ధ్యం కరువు..
- ఆలయ అభివృద్ధిపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలి.. భక్తుల విజ్ఞప్తి







**విశ్వంభర, రావిర్యాల:** భక్తుల కొంగుబంగారంగా, ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. పరిసర ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి సైతం నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక పూజలు, వారాంతాల్లో భక్తుల రద్దీ మరింత పెరుగుతోంది. అయితే భక్తుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారికి అవసరమైన కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**అపరిశుభ్రతతో భక్తులకు ఇక్కట్లు**

ఆలయంలో భక్తులు కాళ్లు కడుక్కునే ప్రదేశం తీవ్ర అపరిశుభ్రంగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ మురికి పేరుకుపోవడంతో పాటు మురుగునీరు నిల్వ ఉండటం వల్ల పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. అమ్మవారి దర్శనం కోసం ఎంతో భక్తిశ్రద్ధలతో వచ్చే భక్తులకు ఈ పరిస్థితులు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. పవిత్రమైన దేవస్థానంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి**

ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. కాళ్లు కడుక్కునే ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతో పాటు మురుగునీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు, ఇతర కనీస సౌకర్యాల కల్పనపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా ఆలయ కమిటీ స్పందించి భక్తుల ఇబ్బందులను గుర్తించి తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆలయానికి పెరుగుతున్న భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తుల సౌకర్యాలు, ఆలయ పవిత్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఈ పుణ్యక్షేత్రం మరింత అభివృద్ధి చెందుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం అమ్మనబోలులో తెలంగాణ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ తండ్రి భిక్షమయ్య ఇటీవల కన్నుమూశారు.భిక్షమయ్య చిత్రపటానికి విశ్వంభర దినపత్రిక రిపోర్టర్ అశోక్ నివాళులర్పించి కాచం సత్యనారాయణను పరామర్శించారు.

## రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన భైంసా ఇన్‌చార్జి కమిషనర్!



**విశ్వంభర, భైంసా:** అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో మరో ప్రభుత్వ అధికారి చిక్కారు. భైంసా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, డిప్యూటీ ఇంజనీర్ జాదవ్ సంతోష్ రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లు చెల్లింపు విషయంలో జాదవ్ సంతోష్ రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నిర్మల్‌లోని మంచిర్యాల్ చౌరస్తా సమీపంలో ఉన్న కుబేర హోటల్ వద్ద కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు జాదవ్ సంతోష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపట్టినట్లు సమాచారం.

## ప్రభుత్వ పథకాల విషయంలో మధ్యవర్తులను నమ్మొద్దు



**విశ్వంభర, మాచారెడ్డి:** ప్రభుత్వ పథకాల విషయంలో మధ్యవర్తులను నమ్మొద్దని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి లబ్ధిదారులకు హితవు పలికారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో మధ్యవర్తులను నమ్మొద్దని, ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా క్యాంపు కార్యాలయానికి రావాలని సూచించారు. మాచారెడ్డి మండలంలో 35 మంది, పాల్వంచ మండలంలో 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు బూస సురేష్, పోసు అనిల్, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టి 7 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లిన డీసీఎం

**విశ్వంభర, మోత్కూరు:** మద్యం మత్తులో ఉన్న డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. దాన్ని ముందు బంపర్‌లో ఇరుక్కున్న విషయాన్ని గమనించకుండా ఏకంగా 7 కిలోమీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఉన్నత పాఠశాల ఎదుట ఓ బైక్‌ను నిలిపి ఉంచారు. అదే సమయంలో అటుగా వచ్చిన అశోక్ లేలాండ్ డీసీఎం వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ డీసీఎం ముందు బంపర్‌లో ఇరుక్కుపోయింది. అయినప్పటికీ డ్రైవర్ ఆ విషయాన్ని గుర్తించకుండా వాహనాన్ని ముందుకు నడిపించాడు. దీంతో బైక్‌ను సుమారు 7 కిలోమీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లాడు. ఇదే సమయంలో బైక్ పక్కన కూర్చొని ఉన్న ఎడవెల్లి సాగర్ (32) చొక్కా వాహనం హ్యాండిల్‌కు చిక్కుకోవడంతో అతడిని కూడా సుమారు 4 నుంచి 5 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో సాగర్‌కు తల, నడుము భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఉమ్మడి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.




# ఇబ్రహీంపట్నంలో చైన్ స్నాచింగ్

**2.5 తులాల మంగళసూత్రం అపహరణ**

**సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం ఫ్యూచర్ సిటీ పోలీసుల గాలింపు**

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** పట్టణంలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి సుమారు 2.5 తులాల బంగారు మంగళసూత్రాన్ని గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నానికి చెందిన ఐతరాజు అనురాధ (40) ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా పట్టణంలోని మార్కుర్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. సాయంత్రం 6.50 గంటల సమయంలో సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడి ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓ ఎం. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని, ఘటనపై కేసు నమోదు ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.



# కేసీఆర్ హయాంలోనే పాలమూరు పచ్చబడింది

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: పాలమూరు జిల్లాను కాంగ్రెస్ పార్టీ వెయ్యేళ్లకు సరిపడా విధ్వంసం చేసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పాలమూరు ప్రాంతం పచ్చబడిందంటే అది కేసీఆర్ నాయకత్వంలోనేనని స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకులు పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అప్పర్ కృష్ణా, భీమా, ఆర్డీఎస్, తుంగభద్ర హైలెవెల్ కాలువల ద్వారా 1960 దశకంలోనే 20 లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పిదాల వల్ల మూడు తరాల పాలమూరు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.35 వేల కోట్లతో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ముందుకు తీసుకెళ్లిందని.. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల టెండర్లను రద్దు చేసిందని ఆరోపించారు. కేవలం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి పనులు పూర్తి చేసి ఉంటే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు. ఇప్పటికైనా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులను ఆన్ చేసి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 35 నెలల్లో పాలమూరు ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కనీసం ఒక్క ఎకరాకైనా అదనంగా సాగునీరు అందించారా అని నిలదీశారు. జూరాల దిగువకు ఈ ఏడాది 245 టీఎంసీల నీరు వచ్చిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయని, 45 రోజులుగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పంపులు నడిపి ఉంటే నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఉండేదని తెలిపారు. కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయాలని మంత్రులను పంపించినా ఫలితం లేకపోయిందని.. కనీసం కర్ణాటక ప్రభుత్వానికి ఒక లేఖ కూడా రాయలేదని ఆరోపించారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందా? లేదా? స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి స్థాయికి తగిన భాషను ఉపయోగించాలని, రాష్ట్ర ప్రతిష్ఠ తో పాటు పదవికి ఉండే గౌరవాన్ని కాపాడాలని హితవు పలికారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాకు ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు కోట్లయినా ఇచ్చిందా అని ప్రశ్నించారు. మూడు ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెనక్కి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, శాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్‌లో సెయింట్ పయస్ స్కూల్ భూముల పై న్యాయ వివాదం !



**విశ్వంభర, మేడ్చల్ బ్యూరో :** అల్వాల్‌లోని సెయింట్ పయస్ స్కూల్‌కు సంబంధించిన భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు పట్టణ భూ గరిష్ఠ పరిమితి (యూఎల్‌సీ) చట్టం కింద భూములు సీలింగ్ సర్‌ప్లస్‌గా గుర్తింపు పొందడం, మరోవైపు అదే భూముల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వివాదానికి దారితీస్తున్నాయి. తాజాగా పాఠశాల యాజమాన్యం నిర్మాణ అనుమతుల కోసం బిల్డ్ నౌ ద్వారా సమర్పించిన దరఖాస్తుపై విచారణ చేపట్టిన అల్వాల్ తహసీల్దార్ కీలక అంశాలను వెల్లడించారు. సర్వే నంబర్ 573లోని 41,574.136 చదరపు మీటర్ల భూమికి సంబంధించి ఎన్‌ఓసీ కోరగా, సదరు భూమి సీలింగ్ సర్‌ప్లస్ పరిధిలో ఉండటంతోపాటు 22ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల పరిశీలనలో 201516 పహాణీ ప్రకారం సర్వే నంబర్ 573లోని 18.37 ఎకరాల భూమి పట్టా భూమిగా నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఎలిజా గోపు మదర్ జనరల్ సెయింట్ ఆన్స్ కో ఎడ్యుకేషన్ సొసైటీ తదితరుల పేర్లు పట్టాదారులుగా ఉన్నప్పటికీ, యూఎల్‌సీ రికార్డుల్లో మాత్రం ఈ భూమి సీలింగ్ సర్‌ప్లస్‌గా గుర్తించబడినట్లు తహసీల్దార్ తన నివేదికలో వివరించారు. ఇదే భూమిలోని 4.30 ఎకరాలను అన్‌రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా జీపీఏ హోల్డర్ కె. వెంకట్ రెడ్డి నుంచి పొందినట్లు దరఖాస్తుదారులు పేర్కొన్నారని విచారణలో వెల్లడైంది. అయితే, రిజిస్టర్ కాని విక్రయ పత్రం ఆధారంగా చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు నిర్ధారించలేమని, భూమికి యూఎల్‌సీ క్లియరెన్స్ కూడా లేదని తహసీల్దార్ నివేదిక స్పష్టం చేసింది. భూమిపై న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నందున తదుపరి చర్యల కోసం నివేదికను రెవెన్యూ డివిజనల్ అధికారికి పంపడంతోపాటు జిల్లా కలెక్టర్‌కు కూడా ప్రతిని సమర్పించారు.

**హైకోర్టు యథాతథ స్థితి ఉత్తర్వులు..**

మరోవైపు ఇదే భూములకు సంబంధించి గతంలోనే హైకోర్టులో న్యాయపోరాటం జరిగినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. అల్వాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 571/2లో 3 ఎకరాల 30 గుంటలు, 572/2లో 3 ఎకరాలు, 573/2లో 4 ఎకరాల 36 గుంటలు కలిపి మొత్తం 11 ఎకరాల 26 గుంటల భూమిపై యూఎల్‌సీ అధికారులు చేపట్టిన చర్యలను సవాల్ చేస్తూ సెయింట్ పయస్ ఎక్స్ కాన్వెంట్ మాజీ మదర్ జనరల్ హైకోర్టును ఆశ్రయించారు. 2005 మే 4న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 580, కలెక్టర్ కార్యాలయంలోని ఫైల్ నంబర్ G1/13089/76 ఆధారంగా చేపట్టిన చర్యలను రద్దు చేయాలని కోరుతూ 2010లో డబ్ల్యూపీ నంబర్ 22827/2010 దాఖలైంది. భూముల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలను నిలువరించాలని, తమ హక్కులకు భంగం కలగకుండా చూడాలని పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు సదరు భూములకు సంబంధించి అన్ని అంశాల్లోనూ యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**నిర్మాణాలపై అనుమానాలు.. ఎన్‌ఓసీ పై ఉత్కంఠ**

ఒకవైపు భూములు సీలింగ్ సర్‌ప్లస్‌గా ఉన్నట్లు రెవెన్యూ నివేదిక, మరోవైపు కోర్టు వివాదాలు, యథాతథ స్థితి ఉత్తర్వులు ఉండటంతో ఈ భూముల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోర్టు ఉత్తర్వుల పరిధి, వాటి అమలు, నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బిల్డ్ నౌ దరఖాస్తుకు తహసీల్దార్ నివేదిక ఆధారంగా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? కోర్టు ఉత్తర్వులు, యూఎల్‌సీ నిబంధనల నేపథ్యంలో నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపడతారు? అన్నది ఆసక్తికరంగా మారింది.

## సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్ ఎస్ ఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు




**విశ్వంభర, సరూర్ నగర్ :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన ఎమ్ ఎస్ ఎఫ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదిగ విద్యార్థుల చైతన్య సమావేశం నిర్వహించి, నూతన ఎమ్ ఎస్ ఎఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ఎల్‌బీ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాదిగ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్ ఎస్ ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని, విద్యార్థుల హక్కులు, విద్యా అవకాశాలు, సామాజిక చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎమ్ ఎస్ ఎఫ్ ద్వారానే మాదిగ విద్యార్థుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. నూతన ఎమ్ ఎస్ ఎఫ్ కమిటీ లో భాగంగా అధ్యక్షులుగా పి . చరణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా జి . సాయి తేజ మాదిగ, ఉపాధ్యక్షులుగా డి . వరుణ్ సందేశ్, ప్రధాన కార్యదర్శిగా పి . శరత్ కుమార్, కోశాధికారిగా వి . శివ సాయి , ఉపాధ్యక్షులు 2 గా జి.దుర్గ ప్రసాద్, అధికార ప్రతినిధి 2 గా ఎం . అజయ్ కుమార్, కోశాధికారి 2 గా పి . సంతోష్, ప్రధాన కార్యదర్శి 2 గా ఎ . ప్రహర్ష , కార్యదర్శులుగా ఎ . నవీన్ , పి . లోకేష్ , గడ్డం అఖిల్ , సహాయ కార్యదర్శులుగా వి . రాజ్ కుమార్ , జి . ఆదిత్య, జి . కిరణ్ , కె . అఖిల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు అనంత నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధికార ప్రతినిధిగా నిరంజన్ యాదవ్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధుల జాబితా మంగళవారం ప్రకటించారు. అధికార ప్రతినిధిగా టి. నిరంజన్ యాదవ్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి రాష్ట్ర స్థాయిలో పోస్టింగ్ ఇవ్వడం చాలా సంతృప్తికరంగా ఉంది. ఇదివరకే ఏఐసీసీ వార్ రూమ్ కో ఆర్డినేటర్ గా , సేవాదళ్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ , చామల కిరణ్ కుమార్ రెడ్డి లకి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం

**కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించిన కేటీఆర్**



**విశ్వంభర, కనగల్:** అమెరికాలో నల్గొండ యువతి శ్రీజ ఇటీవల అదృశ్యమైన సంగతి తెలిసిందే. జిల్లాలోని కనగల్ మండలం శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన యాదగిరి రెడ్డి-రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లారు. ప్రస్తుతం ఆమె యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ బోస్టన్‌లో చదువుకుంటూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తుండగా, ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. శ్రీజ స్నేహితులు ఆమె ఫోన్ చివరి లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు బిడ్డ ఆచూకీ కోసం ఎదురుచూస్తూ తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. శ్రీజ మిస్సింగ్ వార్త వైరల్ అవ్వడంతో నల్గొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని నేరుగా కలిసి పరామర్శించారు. మరోవైపు మాజీ మంత్రి కేటీఆర్ సైతం బాధిత కుటుంబాన్ని ఫోన్ లో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అక్కడ తెలిసిన వారితో తాను మాట్లాడతానని కేటీఆర్ భరోసా ఇచ్చారు.